సాక్షి
యాదాద్రి భువనగిరి



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

స్వర్ణగిరి క్షేత్రంలో 3 నుంచి పవిత్రోత్సవాలు

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన ఉత్సవారంభ స్నపనం, పెద శేషవాహన సేవ, 4న గజ వాహన సేవ, హనుమంతవాహన సేవ, 5న కల్పవృక్ష వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, 6న చిన్న శేషవాహన సేవ, సర్వభూపాల వాహన సేవ, 7వ తేదీన అష్టోత్తర శత కళాభిషేకం, మహాకుంభ సంప్రోక్షణ,గరుడ వాహనసేవ ఉంటాయన్నారు. శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామాజజీయర్ స్వామి దివ్య మంగళ శాసనాలతో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలని కోరారు. పార్టీలకు సంబంధించిన వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను తొలగించాలన్నా రు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకాధికారులను నియమించామని, పెయిడ్ ఆర్టికల్స్‌ను పర్యవేక్షించి సంబంధిత పార్టీ, అభ్యర్థి ఖాతాలో ఖర్చు జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ఎయిమ్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వైద్యసిబ్బంది

బీబీనగర్: స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్‌లో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతం శాంతాసింగ్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాల కాపాడడానికి రక్తం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకో సారి రక్తదానం చేయాలన్నారు. శిబిరం ద్వారా 36 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నృసింహుడికి ఆరాధనలు



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్యారాధనలో భాగంగా గజవాహనసేవ నేత్రపర్వంగా చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, నిజాభిషేకం, తులసీదళ అర్చన జరిపించారు.



శ్రీమహిషాసుర మర్ధిని అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

జయజయహే.. మహిషాసుర మర్ధిని

యాదగిరిగుట్ట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాదగిరికొండపై శివాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు బుధవారం శ్రీపర్వతవర్ధిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి ఉదయం ప్రాతకాల పూజ అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపం, మధ్యాహ్నం శ్రీదేవి చతుషష్ఠి ఉపచార పూజ, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నవావరణపూజ, చతుషష్ఠి ఉపచార పూజ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవేంకటేశ్వరుడికి పాదపద్మార్చన సేవ



స్వామివారికి పద్మార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో బుధవారం శ్రీవేంకటేశ్వర స్వామి వారికి అష్టదళ పద్మ పుష్పాలు, అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ నిర్వహించారు. అంతకుముందు సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం, సాయంత్రం తిరువీధి సేవ తదితర పూజలు నిర్వహించారు.

రాజకీయ పార్టీలు రెడీ

- ముగ్గురు పేర్లతో జాబితా రూపొందించి అధిష్ఠానానికి పంపే పనిలో కాంగ్రెస్ నాయకత్వం
- స్థానికంగానే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు
- అన్ని స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం
- చేరికలపై దృష్టి సారించిన రాజకీయ పక్షాలు



సాక్షి యాదాద్రి: స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి దింపేందుకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టాయి. ప్రజల్లో ఆర్థికంగా, ప్రజల్లో బలం ఉన్న నాయకులను బరిలోకి దించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నారు. అధిష్ఠానం సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ ముగ్గురు పేర్లను పంపనుంది. స్థానిక నాయకత్వం అభీష్టం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బీఆర్‌ఎస్ ఉంది. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం అవుతోంది.

ఎంపీటీసీలుగా పోటీకి అనాసక్తి

సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి రావడంతో ఆశావహులు ఎక్కువగా సర్పంచ్ పదవికి మొగ్గు చూపుతున్నారు. సీట్లు దక్కించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి అంతగా ఆసక్తి కనబరచడం లేదు.

కాంగ్రెస్‌లో ఆశావహులు ఫుల్

కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆశావహులు అధికంగా ఉన్నారు. దీంతో పార్టీ నాయకత్వం ఆచుతూచి అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజాదరణతో పాటు, ఆర్థికంగా ఉన్న నాయకుల కోసం అన్వేషిస్తోంది. ముగ్గురి పేర్లను పరిశీలించి, వారిలో గెలిచే వ్యక్తి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనుంది. ముఖ్యంగా జెడ్పీటీసీకి సంబంధించి ప్రతి మండలానికి మగ్గురు చొప్పున ఆశావహుల పేర్లను తమకు పంపించాలని అధిష్ఠానం ఎమ్మెల్యేలను ఆదేశించింది. జిల్లా పరిషత్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో సంబంధిత స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యేల బంధువులు, మాజీ ఎమ్మెల్యేల బంధువులు, గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ముఖ్య నాయకులు పోటీ పడుతున్నారు.

పొత్తులు కుదిరేనా..

కొన్ని చోట్ల పొత్తులు కుదిరే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌కు వామపక్షాలు మిత్రపక్షంగా ఉన్నాయి. అయితే తాజాగా జరగనున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు కొనసాగుతుందా.. లేదా అన్నది ఆసక్తిగా మారింది. వామపక్షాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొత్తు ధర్మాన్ని పాటిస్తాయా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. అయితే కొన్నిచోట్ల స్థానిక నాయకత్వం పొత్తు విషయంపై తమ అభిప్రాయాన్ని రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఎవరితోను పొత్తు లేకుండా సొంతంగానే పోటీ చేస్తామని వాపపక్ష పార్టీ నాయకుడొకరు 'సాక్షి'తో చెప్పారు.

ఏజెన్సీలతో సర్వే

అభ్యర్థుల విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు సర్వే చేయిస్తున్నాయి. సర్వేల నివేదికల ఆధారంగా అభ్యర్థులను రంగంలోకి దించనున్నాయి. మరోవైపు కేడర్ అభిప్రాయాలను కూడా సేకరించేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా జెడ్పీటీసీ అభ్యర్థుల విషయంలో ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

ముఖ్య నేతలు, అసంతృప్తులకు గాలం

మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులు, అసంతృప్తులకు గాలం వేస్తున్నాయి. ఇటీవల ఆలేరులో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ తన అనుచరగణంతో కాంగ్రెస్‌లో చేరారు. అదే మండలంలో శారాజీపేటకు చెందిన కొందరు నాయకులు రెండు రోజుల క్రితం కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. తమకు టికెట్ దక్కదని అభిప్రాయానికి వచ్చిన పలువురు ఆశావహులు ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది.

నేడు విజయదశమి



రావణుడి కటౌట్‌ను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

భువనగిరి, యాదగిరిగుట్ట: దసరా పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు.శమి, ఆయుధ పూజలకు ఏర్పాట్లు చేసుకున్నారు. దుర్గాదేవిని ఆరాధించడం, ఆమెను శక్తి స్వరూపిణిగా భావించడం ఈ పండుగ ప్రత్యేకత. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారు.

కిక్కిరిసిన మార్కెట్‌లు, దుకాణాలు

కొనుగోలుదారులతో మార్కెట్‌లు సందడిగా మారాయి. జీఎస్టీ తగ్గడంతో బైకులు, కార్లు కోనుగోలు చేసేందుకు ఎక్కువ మంది అసక్తి చూపారు.

గుట్ట క్షేత్రంలో శమీ పూజ

దసరా పండుగను పురస్కరించుకొని గురువారం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట శమీపూజ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30గంటలకు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా భక్తుల మధ్య శమీపూజ జరిపిస్తారు.

టైగర్ దామన్న ఇక లేరు

- హైదరాబాద్‌లో కన్నుమూసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- కమ్యూనిస్టుల కంచుకోటలో కాంగ్రెస్‌కు జవసత్వాలు నింపిన నేత
- తుంగతుర్తి నుంచి నాలుగుసార్లు, సూర్యాపేట నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం
- 3న సూర్యాపేటకు పార్థివదేహం
- 4న తుంగతుర్తిలో అంత్యక్రియలు



సూర్యాపేట : టైగర్ దామన్నగా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో పేరుగాంచిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాలలో ఆయన జన్మించారు. తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పునూతల కొసల్యాదేవి కుమార్తె వరూధినిదేవిని వివాహ మాడారు. ఆయనకు కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ఉన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి వెంకట్‌రెడ్డికి స్వయానా సోదరుడు. దామోదర్‌రెడ్డి 1985 నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా పనిచేశారు. పార్టీకి ఎంత కష్ట కాలం వచ్చినప్పటికీ పార్టీని వీడకుండా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో కార్యకర్తలకు అండగా నిలిచారు.

కమ్యూనిస్టుల కంచుకోటలో..

1985 నాటికి తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టు ప్రాబల్యంతోపాటు కాంగ్రెస్ పార్టీలో అనేక చీలికలు పేలుకలు ఉండడంతో కమ్యూనిస్టులను ఓడించడం ఎవరికి సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో ఎర్రపహాడ్ జమీందారు జన్నారెడ్డి శ్యాంసుందర్ రెడ్డికి స్వయంగా బావమరిది అయిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దించింది. 1985లో దామోదర్‌రెడ్డి మొదటిసారి తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి దాకా తుంగతుర్తి నియోజకవర్గం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది. 1989లో మరోసారి గెలుపొందారు. మూడోసారి 1994లో కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి సీపీఎం అభ్యర్థిపై విజయం సాధించారు. నాలుగోసారి 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర చేతిలో ఓటమిపాలయ్యారు. తిరిగి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి అదే సంకినేని వెంకటేశ్వర రావుపై విజయం సాధించారు. ఈసారి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. అనంతరం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీకి రిజర్వు కావడంతో.. సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీఆర్‌ఎస్ అభ్యర్థి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై విజయం సాధించారు. 1985 నుంచి వరుసగా తుంగతుర్తి నుంచి మూడుసార్లు గెలుపొంది ఒకసారి ఓటమి చవిచూసి మరోసారి గెలుపొంది నాలుగుసార్లు విజయం సాధించారు. అనంతరం సూర్యాపేట నుంచి 2009లో మరోసారి విజయం సాధించి మొత్తంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1989, 1994లో తెలుగుదేశం మిత్రపక్షాల హవాలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని స్థానాలు గెలుపొందగా.. కేవలం తుంగతుర్తి నియోజకవర్గంలో మాత్రమే దామోదర్‌రెడ్డి గెలుపొంది కాంగ్రెస్ సత్తా చాటారు. 1985 కంటే ముందు తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టుల హవా కొనసాగి భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేలుగా పనిచేయగా దామోదర్‌రెడ్డి రంగ ప్రవేశంతో కమ్యూనిస్టుల ప్రాబల్యానికిగండి కొట్టినట్లు అయింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించి అసెంబ్లీ టైగర్ గా పేరుగాంచిన దామోదర్ రెడ్డి కనుమూయడంతో తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ పెద్దదిక్కును కోల్పోయింది.

రోడ్డుకు వేసవిలో శాశ్వత మరమ్మతులు

- ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు



చెరువు కట్టపై రోడ్డు కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ రమేష్‌బాబు

మోత్కూరు: మొత్కూరు పెద్ద చెరువు (మినీ ట్యాంక్‌బండ్) కట్ట రోడ్డుకు వేసవిలో శాశ్వత మరమ్మతులు చేపడుతామని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో కుంగిన చెరువు కట్టకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా మళ్లీ కుంగడంతో బుధవారం ఈఈ సత్యనారాయణగౌడ్‌తో కలిసి పరిశీలించారు. కట్ట అడుగు భాగాన బుంగపడటం లేదా, ఆ స్థలంలో పాడుబడిన బావి ఉండటం గాని, కొత్త, పాత కట్ట నిర్మాణాలు బలోపేతంగా లేకపోవడం వల్ల కట్టపై రోడ్డు కుంగి, పగుళ్లు వస్తుండవచ్చని అభిప్రాయపడ్డారు. చెరువులో నిండుగా నీరు ఉండటం వల్ల మరమ్మతులు చేపట్టలేమన్నారు. వేసవిలో శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు. అప్పటి వరకు వాహనాలను దారి మళ్లిస్తూ కుంగిన చోట భద్రత దృష్ట్యా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పోలీసులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈలు అఖిల్, చంద్రశేఖర్, విక్రమ్ ఉన్నారు.

ముందుగానే గ్రామాలకు మద్యం తరలింపు

- మద్యం దుకాణాల నిర్వాహకుల కొత్త ఎత్తుగడ
- నేడు గాంధీ జయంతి సందర్భంగా లిక్కర్ అమ్మకాలు బంద్
- బెల్ట్ షాపుల ద్వారా విక్రయానికి ఏర్పాట్లు

సాక్షి, యాదాద్రి: గాంధీ జయంతి రోజు మద్యం, మటన్ దుకాణాలు మూసివేయడం ఆనవాయితీ. ఇదే రోజు దసరా పండుగ కూడా రావడంతో మాంసం, మద్యం ప్రియులతో పాటు వ్యాపారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. దసరా రోజు రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. ఏటా ఈ ఒక్క రోజే జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్ల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు కలిసిరావడంతో రెట్టింపు అమ్మకాలు జరిగే అవకాశం ఉంది. దీంతో మద్యం దుకాణాల యజమానులు ముందుస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. బెల్ట్ దుకాణాల ద్వారా విక్రయించేందుకు ఇప్పటికే మద్యాన్ని పెద్ద ఎత్తున గ్రామాల్లో డంప్ చేసినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా బెల్టు దుకాణాల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.

ప్రత్యేకంగా వైన్స్‌ల కేటాయింపు

మద్యం షాపుల యజమానులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. వాటికి మద్యం సరఫరా చేయటానికి మండలాల వారీగా ప్రత్యేకంగా వైన్స్‌లను కేటాయించారు. జిల్లాలో 82 మద్యం షాపులున్నాయి. వీటి పరిధిలో 2 వేలకు పైగానే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి.

ముందుగానే మాంసం, మద్యం కొనుగోలు

దసరా పండుగా, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మద్యం ప్రియులు బుధవారం రోజే అవసరం మేరకు కోనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో రాత్రి వైన్స్‌లను మూసివేసే వరకు రద్దీ నెలకొంది. అదే విధంగా మాంసం షాపులు రాత్రి 12 గంటల వరకు పనిచేశాయి. ముందస్తు కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి.

ఇళ్లలో, రహస్య ప్రాంతాల్లో డంప్

ఆలేరు:మద్యం అమ్మకాలకు వైన్స్‌ల నిర్వాహకులు స్కెచ్ వేశారు. ఆలేరు సర్కిల్‌లోని ఆలేరు, యాదగిరిగుట్ట, రాజాపేట, మోటకొండూరు, తుర్కపల్లి మండలాల పరిధిలో 22మద్యం షాపులున్నాయి. ఆయా మండలాల్లో 250 నుంచి 300 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయి. చిన్న బెల్ట్‌షాప్‌కు రూ.50 వేలు, పెద్ద బెల్ట్ దుకాణానికి రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షలు విలువ చేసే రకరకాల బ్రాండ్ల మద్యం తరలించినట్టు తెలిసింది. స్టాక్ అయిపోతే వెంటనే తరలించేందుకు రహస్య ప్రాంతాలు, తెలిసిన ఇళ్లలో పెద్ద ఎత్తున మద్యం నిల్వ చేసినట్టు సమచారం.

బుధవారం అమ్మకాలు జరిగినట్లుగా రికార్డుల్లో లెక్కలు

గాంధీ జయంతి సందర్భంగా ఆ రోజు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుంది. ఈనేపథ్యంలో వైన్స్‌ల నిర్వాహకులు కొత్త ఎత్తుగడ వేశారు. గురువారం అధికారికంగా మద్యం విక్రయించలేరు. కాబట్టి బుధవారం ఎక్కువగా విక్రయించినట్టు లెక్కల్లో చూపించే ప్రయత్నం చేశారు.

కేసులు నమోదు చేస్తాం : ఆలేరు ఎక్సైజ్ సీపీ దీపిక

గురువారం తనిఖీలు నిర్వహిస్తాం. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు చేస్తే స్టాక్ సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఆలేరు ఎక్సైజ్ సీఐ దీపిక హెచ్చరించారు.

వెండి ఆభరణాలు బహూకరణ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి అనుబంధంగా యాదగిరి కొండపై ఉన్న శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి క్షేత్రంలోని అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు రెండు కిలోల వెండి ఆభరణాలను బహుకరించారు. శంకుహస్తం, పాశాస్తం, అభయహస్తం, వరద హస్తం ఆబరణాలను ఆలయ అర్చకులకు అందజేశారు. అంతకుముందు శివాలయంతో పాటు ప్రధానాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ఆ గ్రామాల్లో దసరా ప్రత్యేకం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేట, రామన్నపేట మండలం లక్ష్మాపురంలో దసరా పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. లక్ష్మాపురంలో గ్రామస్తులు దసరా రోజు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు జాతీయ జెండా, తల్వార్లతో ర్యాలీగా జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

జాతీయ జెండా ఆవిష్కరణ



లక్ష్మాపురంలో దసరా రోజు జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గ్రామస్తులు (ఫైల్)

రామన్నపేట: రాన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో దసరా రోజు జాతీయ జెండాను ఎగురవేస్తారు. గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుండి కచ్చేరు వద్ద జాతీయ జెండాను ఎగురవేసే సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన పటేల్ వంశోస్తులు పండుగ రోజు తెల్లవారుజామున పాత జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఉదయం 10గంటల సమయంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి కొత్త జెండా కర్రకు అలంకరణ చేసి కొత్త తాడుతో జాతీయ జెండాను ఎగర వేయడం జరుగుతుంది. జాతీయ పతాకావిష్కరణలో గ్రామస్తులంతా పాల్గొంటారు. జమ్మిచెట్టు వద్దకు పూజకు వెళ్లే సమయంలో అక్కడే పూజలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు, కులపెద్దలకు కంకణాలు అందజేస్తారు. జమ్మిచెట్టు నుంచి జాతీయజెండా వద్దకు తిరిగి వచ్చి ఒకరికొకరు జమ్మి పెట్టుకొని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అదేవిధంగా నిధానపల్లిలో బురుజుపైన, నీర్నెముల, శోభనాద్రిపురం, సిరిపురం గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

ఏటా స్వగ్రామానికి ఠాకూర్ వంశస్తులు



రాజాపేటలో దసరా రోజు జమ్మికోసం ప్రదర్శనగా వెళ్తున్న ఠాకూర్ వంశస్తులు (ఫైల్)

రాజాపేట : దసరా పండుగను రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు ప్రత్యేకంగా జరుపుకుంటారు. చాలామంది హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ పండుగ రోజు స్వగ్రామానికి విచ్చేసి వేడుకల్లో పాల్గొంటారు. రాజుల కాలం నుంచి గ్రామానికి చెందిన ఠాకూర్ వంశస్తులు దుర్గామాతకు నవరాత్రులు పూజలు నిర్వహించి 9వ రోజు ఆయుధపూజ నిర్వహిస్తారు. సాంప్రదాయ దుస్తులు ధరించి గుర్రం(సిరిమల్లె) వంశీయులతో కలిసి డప్పువాయిద్యాలతో గడికోటలోని మైసమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజ లు చేస్తారు. అనంతరం జాతీయ జెండాను చేతబూని తల్వార్లతో ప్రదర్శన నిర్వహిస్తూ జమ్మి కోసం బయల్దేరుతారు. గ్రామం శివారులోని సంఘమేశ్వరస్వామి దేవాలయం వరకు చేరుకుని జమ్మి వృక్షానికి పూజలు చేస్తారు. పూర్వం మాత్రం ఠాకూర్ వంశానికి చెందిన సత్యనారాయణసింగ్ తనకున్న లైసెన్స్ గన్ భుజానికి వేసుకుని ఊరేగింపుగా వెళ్లి శమిపూజ తర్వాత గన్‌తో రెండుమార్లు తూర్పుదిక్కు గాలిలోకి పేల్చిన అనంతరం ప్రజలు జమ్మి తీసుకునేవారు. ఠాకూర్ సత్యనారాయణసింగ్ 1994 వరకు ఈ సాంప్రదాయాన్ని కొనసాగించారు.















పండుగకు నోచుకోని గ్రామాలు

- రాజకీయ ఆధిపత్యంతో 42 ఏళ్లుగా దసరా జరుపుకోని చిల్పకుంట్ల గ్రామస్తులు
- కంకణం కట్టే విషయంలో తగాదాతో మిర్యాల, మాచనపల్లి వాసులు కూడా పండుగకు దూరం

నూతనకల్: రాజకీయ ఆధిపత్యం, కులాల మధ్య తగాదాతో నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల, మిర్యాల, మాచనపల్లి గ్రామాల్లో గత కొన్నేళ్లుగా ఆయా గ్రామస్తులు దసరా పండుగ జరుపుకోవడం లేదు. గతంలో దసరా పండుగ రోజు కంకణం కట్టే విషయంలో ఏర్పడిన చిన్న తగాదా నేటి వరకు కూడా ఆయా గ్రామాలు దసరా వేడుకలకు నోచుకోకుండా ఉన్నాయి. చిల్పకుంట్ల, మిర్యాల గ్రామాల్లో ఆనవాయితీగా గ్రామ సర్పంచ్ దసరా ఉత్సవాల్లో కంకణం కట్టే సాంప్రదాయం కొనసాగుతుండేది. చిల్పకుంట్ల గ్రామం సీపీఎం ఆధిపత్యంలో కొనసాగుతుండగా.. 1982లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) అభ్యర్థి బాణాల చంద్రారెడ్డి సర్పంచ్‌గా గెలుపొందారు. ఆయన కంకణం కట్టే విషయంలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో 42 ఏళ్లుగా ఆ గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు. అదేవిధంగా మిర్యాల గ్రామంలో మూడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైన నాగేశ్వర్‌రావుకు కంకణం కట్టే విషంలో ఏర్పడిన ఘర్షణ వలన నాగేశ్వర్‌రావు హత్యకు గురయ్యాడు. దీంతో నాటి నుంచి నేటి వరకు గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు. మాచనపల్లి గ్రామంలో కులాల మధ్య కంకణం కట్టే విషయంలో ఏర్పడిన తగాదాల వలన దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు.



మిర్యాల గ్రామం వ్యూ

పండుగ గుర్తెరగం



నా చిన్నతనం నుంచి నేటి వరకు కూడా మా గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం చూడలేదు. మా గ్రామంలో గతంలో దసరా ఉత్సవాల సందర్భంగా కంకణం కట్టే విషయంలో కులాల మధ్య ఏర్పడిన ఘర్షణల వలన నేటికీ పండుగ జరుపుకోవడం లేదు.

– పసునూటి అయోధ్య, మాచనపల్లి

దసరా జరుపుకునేలా చూడాలి



నా వయస్సు 34 సంవత్సరాలు. గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించక దాదాపు 42 సంవత్సరాలు. మా గ్రామంలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మధ్య ఆధిపత్య పోరుతో కంకణం కట్టుకునే విషయంలో ఏర్పడిన ఘర్షణ వలన దసరా జరుపుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు కలిసి దసరా పండుగ జరుపుకునేలా చూడాలి.

– పులుసు సతీష్‌గౌడ్, చిల్పకుంట్ల

నాణ్యమైన సేవలు అందిస్తాం

- బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశం

నల్లగొండ, రామగిరి (నల్లగొండ): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం అన్నారు. బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పానగల్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ సాంకేతికతతో నిర్మించబడిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్లను ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. ప్రజలకు చవక, నమ్మదగిన సేవలను అందిస్తూ బీఎస్ఎన్ఎల్ ముందంజలో ఉందని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్‌టీటీహెచ్ ప్యాకేజీలు రూ.299, రూ.399లో భాగంగా వినియోగదారులకు ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, టీవీ ఛానల్స్, ఓటీటీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మురళీకృష్ణారెడ్డి, ఐఎఫ్ఏ సత్యనారాయణ, ఏజీఎం సుబ్బారావు, శాంతికుమారి, రాములు, సురేందర్, వెంకన్న, నరేందర్, జీవన్‌కుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సన్మానిస్తున్న వెంకటేశం తదితరులు

అర్ధరాత్రి వరకు శ్రమించిన పోలీసులు



క్రేన్ సహాయంతో యాసిడ్ ట్యాంకర్‌ను తొలగిస్తున్న దృశ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద మంగళవారం యాసిడ్ ట్యాంకర్ బోల్తా పడగా.. దాని కింద పడి నలిగిపోయిన తూఫాన్ వాహనాలను బయటకు తీసేందుకు పోలీసులు అర్ధరాత్రి వరకు శ్రమించారు. యాసిడ్ ట్యాంకర్ తలకిందులుగా పడటం, అందులో యాసిడ్ ఉండడం, పోలీసులు రెండు జేసీబీలు, మూడు క్రేన్‌లు తీసుకొచ్చి ఐదు గంటలకు పైగా శ్రమించిన తర్వాత ట్యాంకర్ పైకి లేచింది. దానిని రోడ్డు పక్కకు ఉంచారు. అదేవిధంగా ట్యాంకర్ కింద నుజ్జునుజ్జయిన తూఫాన్ వాహనాలను బయటకు తీశారు.

తగ్గిన వరద

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. 4,14,188 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అంతే నీటిని సాగర్ జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. 26 గేట్ల ద్వారా 3,61,322 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 33,536, మొత్తం 3,94,858 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ, ఏఎంఆర్పీ, వరద కాల్వలకు 19,330 క్యూసెక్కులు వదులుతున్నారు.






























క్లుప్తంగా

మాంసం దుకాణాల వద్ద రద్దీ


రాత్రివేళ మాంసం దుకాణాల వద్ద రద్దీ

భూదాన్‌పోచంపల్లి : దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మండలవ్యాప్తంగా గురువాం మాం సం దుకాణాలు మూసి వేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచే మాంసం విక్రయ దుకాణాల వద్ద మాంసం ప్రియులు బారులుదీరారు. అర్ధరాత్రి వరకు మాంసం దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

మాంసం విక్రయ దుకాణదారులకు నోటీసులు

మోత్కూరు : గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం దుకాణాలు తెరువొద్దని బుధవారం మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పలు మాంసం విక్రయ దుకాణదారులకు నోటీసులు అందజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఆర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో బుధవారం బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండె పోటు వచ్చిన వెంటనే చేయాల్సిన ప్రథమ చికిత్స విధానాలను చూపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, బోధి ధర్మ అసోషియేషన్ అధ్యక్షుడు సీత భాస్కర్, శిక్షకురాలు కొయ్యడ సంధ్య, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శి దోర్నాల బాలరత్నం తదితరులు పాల్గొన్నారు.

అనూషకు సన్మానం

భువనగిరి : ఇటీవల ప్రకటించిన గ్రూపు–2 ఫలితాలతో సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికైన పెంచికల్ పహాడ్ గ్రామానికి చెందిన అనుషాను బుధవారం ఆ గ్రామానికి చెందిన పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపె నర్సింహ, ఏసు, మహంకాళి, మహేష్, కుమారస్వామి, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి

మోత్కూరు : బునాదిగాని కాలువ, బ్రుందావన్ కాలువలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుని వినతిపత్రం అందజేశారు. బునాదిగాని కాల్వకు 269 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు. భూసేకరణకు రూ.16.70 కోట్లు విడుదల చేయాలని కోరారు. మోత్కూరులోని బ్రుందావన్ ఆనకట్ట, గేట్లు, కాల్వ మరమ్మతులకు రూ.1.43 కోట్ల నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లింగస్వామి



భూదాన్‌పోచంపల్లి : ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పోచంపల్లికి చెందిన ఎడ్ల లింగస్వామిని నియమిస్తూ బుధవారం జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ నియామక అందజేశారు. ఎడ్ల లింగస్వామిని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ సందెల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పాముకుంట్ల బస్వయ్య, కరగల్ల కుమార్, యాకరి నర్సింగ్‌రావు, పెద్ద చక్రపాణి, వెంకటేశం, కుక్క కుమార్, శ్రీనివాస్ సన్మానించారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

మోటకొండూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిమట్ల మదార్ గౌడ్, భాస్కరుణి రఘునాథరాజు, కొంతం మోహన్‌రెడ్డి, తండ పాండురంగయ్య, శీల బాలకృష్ణ, భూమండ్ల శ్రీనివాస్, బాల్ద రామకృష్ణ, బోయిన ఝాన్సీ, బుగ్గ కొమురయ్య, పేరబోయిన కార్తీక్, వంగాల మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన గంట దిలీప్‌రెడ్డి, గంట నర్సిరెడ్డి ఇటీవల మృతి చెందారు. గ్రామ వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.1.12లక్షలను బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కోటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి మృతుడి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసుల అంజయ్య, దాసరి నర్సింహ, గొడిసె నాగభూషణం, దిండు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మోటకొండూర్: ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఇందిర, తహసీల్దార్ నాగదివ్యలు అన్నారు. బుధవారం ఎన్నికల కోడ్ అమలుపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీవీటీ, ఎస్ఎస్‌టీ, పీఎస్‌టీ టీములను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ అశోక్, ఎంపీఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ యశోద, షఫీ, రవి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మోత్కూరు : స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ డీ.బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ పి.జ్యోతి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేశ్వర్లుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరగడానికి రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రజలు సహకరించాలన్నారు.

స్థానిక ఎన్నికలు పకడ్బందీ ఏర్పాట్లు

యాదగిరిగుట్ట రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ, మండల అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ నవీన్ కుమార్, తహసీల్దార్, మండల అడిషనల్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ గణేష్ నాయక్, సీఐ భాస్కర్ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు ఎన్నికల నిర్వహణకు మం ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్ మండల పరిషత్ చేరాయన్నారు. ఓటర్ లిస్టు కాపీలను గ్రామ పంచాయతీ వారికి అందజేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లొద్దని తెలిపారు.

గుండాల : ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ ఎం.చండీరాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్ అమలుపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు ఏ సమస్య వచ్చిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.హరికృష్ణ, ఎంపీవో సలీమ్, సూపరింటెండెంట్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మోటకొండూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇందిర


మోత్కూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలాజీ


అడ్డగూడూరు : సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ శంకరయ్య, తహసీల్దార్ శేషగిరి రావు


బొమ్మలరామారం : సమావేశంలో పాల్గొన్న అధికారులు

అడ్డగూడూరు : స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శంకరయ్య, తహసీల్దార్ శేషగిరి రావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నిక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

బొమ్మలరామారం : స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ రాజా త్రి విక్రమ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ బుగ్గ శ్రీశైలం కలసి నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశం పాల్గొని మాట్లాడారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 284 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీమాళిని, సూపరిండెంట్ గడ్డం జ్ఞానప్రకాష్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈఈ భరత్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయొద్దు

- కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ హనుమంతురావు అన్నారు. మండలంలోని రహీమ్‌ఖాన్‌గూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

పరిహారం చెల్లించాలని హైవేపై రాస్తారోకో


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లించి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వివరాలు.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన మహంకాళి సురేష్ తన భార్య కవిత, కుమారులు యశ్వంత్, గౌతమ్‌లను తీసుకుని దసరా పండుగకు నారాయణపురం మండలం లింగంవారిగూడెం గ్రామంలోని అత్తగారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలంలోని దామెర గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన కారు వీరి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ చనిపోయాడు. అతడి భార్య, కుమారులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నారు. కాగా పరిహారం చెల్లింపు విషయమై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కారు యజమాని సంబంధితులతో సమావేశమయ్యాయి. బాధితులు అడిగిన పరిహారం ఇచ్చేందుకు ప్రమాదానికి కారణమైన వ్యక్తి, అతడి తరఫు వారు అంగీకరించకపోవడంతో బాధిత కుటుంబానికి చెందినవారు ఆగ్రహించి బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. స్పందించిన పోలీసులు వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. పరిహారం ఇచ్చేందుకు మునుగోడు మండలం కమ్మగూడెంకు చెందిన కారు యజమాని అంగీకరించడంతో బాధిత కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషిచేయాలి


మోటకొండూర్ : ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు, బీజేపీ నాయకులు


మోత్కూరు : సమావేశంలో పాల్గొన్న స్వయం సేవకులు

మోత్కూరు : సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి రాంప్రసాద్ అన్నారు. బుధవారం మోత్కూరులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి భారతీయుడు హిందువునని గర్వంగా చెప్పుకోవాలన్నారు. సామాజిక సామరస్యత, కుటుంబ ప్రభోదం, పర్యావరణ పరి రక్షణ, భాష, వేషధారణ, పౌర నియమాలు విషయాలను ఆచరించినట్లయితే సమాజంలో పరివర్తణ జరుగుతుందని అన్నారు. అంతకుముందు స్వయం సేవకులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పద సంచాలన్ నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని కాపాడటమే ఆర్ఎస్ఎస్ ధ్యేయం

మోటకొండూర్: సనాతన ధర్మాన్ని కాపాడటమే ఆర్ఎస్ఎస్ ధ్యేమని స్వయం సేవకుడు సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ చేశారు. కార్యక్రమంలో పైళ్ల యాదిరెడ్డి, జోరుక ఎల్లేష్, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, యెల్లంల శ్రీధర్‌రెడ్డి, భూరెడ్డి జనమేజయ రెడ్డి, గుర్రాల రవి, సుల్తాన్ మహేందర్, గుర్నాల కోటేష్ ఉన్నారు.

ఘనంగా ‘లియాఫీ’ ఆవిర్భావ దినోత్సవం

భువనగిరి : పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం లియాఫీ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భువనగిరి ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షుడు కరకాల సుదర్శన్ జెండాను ఎగరవేశారు. అనంతరం బ్రాంచ్ కార్యాలయంలో తాత్కాలికంగా పనిచేస్తున్న సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి గుగులోతు వెంకన్న, జోనల్ ఈసి సభ్యులు వీరారెడ్డి, నాయకులు నర్సింహ, అబ్బగాని వెంకట్, మల్లేశం, చంద్రమౌళి, అజయ్ కుమార్, బిక్షంరెడ్డి, యాదగిరి, అశోక్, బ్రాంచ్ మేనేజర్ బలరాం, ఏబీఎం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న లియాఫీ నాయకులు

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

తుర్కపల్లి : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హిందూ ధర్మరక్ష ఫౌండర్ చీకోటీ ప్రవీణ్ అన్నారు. ఇబ్రహీంపురం గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బూర్లు ఉపేందర్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, మాటూరి భాను, శ్రీకాంత్ రెడ్డి, శివ యాదవ్, పల్లె వేణుగౌడ్, నరేష్, సత్యం, వాసుదేవ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


పూజలు నిర్వహిస్తున్న ఏసీపీ,పోలీస్ సిబ్బంది

తుర్కపల్లి: దసరా పండుగను పురస్కరించుకుని స్థాని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు , సీఐ శంకర్ గౌడ్, ఎస్ఐ తక్యూద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తుర్కపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బుధవారం ఆయన సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు


రామన్నపేట : వెల్లంకిలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు


భువనగిరి : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కూతురు కీర్తిరెడ్డి


మోటకొండూర్: మహా చండీ యాగంలో పాల్గొన్న నాయకులు, భక్తులు


గుండాల : పూజలు చేస్తున్న భక్తులు


ఆత్మకూరు(ఎం) : కూరెల్లలోని దుర్గామాత వద్ద చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు


చౌటుప్పల్‌లో నగర సంకీర్తన చేస్తున్న భవానీ మాలధారులు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- జనావాసాల్లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు
- భయాందోళనలో ప్రజలు

బొమ్మలరామారం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అనేకచోట్ల కంచె లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. ఇళ్ల ముందు కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, చువ్వలు తేలి శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలుండడం.. అప్పుడప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మెరుపులు, మంటలు వస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయంభయంతో కాలం వెళ్లదీస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో మూగజీవాలైన కోతులు, కుక్కలు, ఆవుదూడలు మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నాయి.

పలు గ్రామాల్లో పొంచి ఉన్న ప్రమాదం..

పలు గ్రామాల్లో ఎలాంటి రక్షణ వలయాలు లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ముఖ్యంగా మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో ఇళ్ల మధ్యలో కంచె లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దానికి సమీపంలో గల పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు తేలాయి. మల్యాల గ్రామంలో జనవాసాలలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఈ కేంద్రానికి వచ్చే చిన్నారులు ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లే అవకాశం ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులను పంపేందుకు వారి తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. మండలంలో మైసిరెడ్డి పల్లి గ్రామ పరిధిలో సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి తోట సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ కూడా తక్కువ ఎత్తులో రక్షణ వలయం లేకుండా ప్రమాదకరంగా ఉంది. మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ ఆస్పత్రి పక్కనే గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి రక్షణ కంచే లేదు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఆస్పత్రికి వచ్చు రోగులు, వారి బంధువులతో ఈ ప్రాంతం నిత్యం జనాలతో రద్దీగా ఉంటుంది. పలుమార్లు వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తు న్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యవైఖరి వీడి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.


రామలింగంపల్లిలో జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


మల్యాలలో అంగన్‌వాడీ కేంద్రం పక్కన కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఇబ్బందులు పడుతున్నాం



రామలింగంపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు పడుతున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరో చోటుకు మార్చాలని గ్రామ సభలో గతంలోనే తీర్మాణం చేశారు. కానీ నేటికి అమలు కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి తరలించాలని..నూతన విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– సుంచు యాదగిరి, రామలింగంపల్లి

మరో చోటుకు మార్చాలి



మల్యాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పక్కనే గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులను పంపేందుకు వారి తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. జనవాసాల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో భయాందోళనకు గురవుతున్నాం. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కంచెలేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు తరలించాలని కోరుతున్నాం.

– జెల్లా పాపులు, బొమ్మలరామారం

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిస్థానాల్లో పోటీచేస్తాం


తుర్కపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సుర్వి శ్రీనివాస్

తుర్కపల్లి: స్థానిక, పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు సుర్వి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ,బానోత్ నరేందర్ నాయక్, యాట పెంటయ్య, శత్రునాయక్,చలమయ్య, చాందాపాషా, ఆకుల రమేష్, సైదులు, వెంకటేష్, నరసింహ, ఆంజనేయులు, కనకయ్య, రాజుగౌడ్, రామచంద్రం, కరుణకర్, విజయ్, బాలరాజు పాల్గొన్నారు.

బీబీనగర్ : స్థానిక ఎన్నికల్లో అన్నిస్థానాల్లో పోటీ చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం గౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు గూడూరు నరోత్తమరెడ్డి విజయ్‌భాస్కర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, స్వామిగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

వలిగొండ : స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చందా మహేందర్ గుప్తా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కొప్పుల యాదిరెడ్డి, బోళ్ల సుదర్శన్, బందారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, సీల్లోజు శ్రీరాములు, బచ్చు శ్రీనివాస్, మత్స్యగిరి, తానీషా, పాక పుల్లయ్య, నర్సింహా, దోగిపర్తి సంతోష్, అశెట్టి సంతోష్, రాము పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన వికలాంగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సదరం సర్టిఫికేట్ ఉన్న ప్రతి ఒక్కరికి యూడీఐడీ కార్డును జారీ చేయడంతో పాటుకొత్తగా యూడీఐడీ కార్డుల జారీ కోసం క్యాంపుల సంఖ్యను పెంచాలన్నారు. కాలపరిమితి మించిన సదరం సర్టిఫికేట్స్ రెన్యూవల్స్ కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు యూడీఐడీ కార్డు వర్తించేలా ప్రభుత్వం అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వేదిక నాయకుడు గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త లలిత, నాయకులు తిరుమల్, లక్ష్మీ, విఠల్, సంతోష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.